# భాషాసేవ

అన్నగారు భాషాసేవ చేయ సంకల్పించారు.

అయితే అన్నగారు అతి దర్జా మనిషి. వారికి సేవికావృత్తి ఎట్లా ఒప్పుతుందా అని ఆశ్చర్యపడ్డాం మొదట్లో.

కాని, అన్నగారు అన్నిట్లోనూ, అందరల్లేగాక అదో కొత్తదారి తొక్కుతారు. భాషాసేవలో కూడా అన్నగారు కొత్తదారే తొక్కారు!

❋ ❋ ❋ ❋ ❋

"అదివరలో భషాదేవిని ఆరాధించినవారు దేవికి అత్యాచారం చేశారు" అన్నారన్నగారు.

"భాషాదేవిని ఎత్తయిన పీఠం మీద కూచోబెట్టి దానికంట కట్టేశారు."

"ఎత్తయిన పీఠాన కూర్చోబెట్టినంత మాత్రాన దేవీ పూజ పూర్తికాదు...

"దేనికి బంధవిముక్తి కలిగించాలి! పీఠం మీదినుంచి దించి, దేవికి సమ్యగ్దర్శనం గల రసికులందరి పరిచయమూ చేయాలి...

"ఆమెకు వెనకటి అర్చకులు ధూపంవేసి ఊపిరి సలపకుండా చేశారు; దేనిచేత సుకుమారమైన పరిమళాలు ఆఘ్రాణింపచేయాలి?...

"ఆమె చెవులదగ్గిర పూర్వపు అర్చకులు జేగంటలు వాయించి వొదిలిపెట్టారు. శంఖాలూదారు, కఠోరమైన – భావరహితమైన – మంత్రాలు చదివారు; ఆమె చెవులకింపైన వీణాగానం – చక్కని భావకవిత్వం – మెత్తని పువురేకులవంటి మధురశబ్దాలు వినిపించాలి!"

అన్నగారి భావాలకు అందరమూ ముగ్ధులమయినాం, వారి భాషాసేవ కళ్లారా చూడాలనే కోరిక అందరికీ కలిగింది.

❋ ❋ ❋ ❋ ❋

భాషాదేవి కట్లు అందరి ఎదటా విప్పి, ఆమెను ఎత్తయిన పీఠం మీదినుండి కిందికి స్వయంగా చెయ్యిపట్టుకుని దింపారన్నారు.

కిందికి స్వయంగా చెయ్యిపట్టుకుని దింపారన్నగారు.

అందరూ హర్షింప కరతాళ ధ్వనులు చేశాం.

పాత పూజారులూ మరికొందరు ముసలాళ్లూ, నెత్తి నోరూ బాదుకుంటూ, "అయ్యో! అయ్యో! అత్యాచారం! మీకేం పొయ్యేకాలమ(గ్రా?" అని లబలబలాడారు. కాని వాళ్లను చూసి మేమంతా నవ్వాం.

ముసలాళ్లల్లో కొందరు జన్మలో ఎన్నడూ దేనిమీద ఒక పుష్పమైనా విసిరేసిన పాపాన పోయి ఎరగరు. అటువంటి వాళ్లచేత మాటలు పడటానికి ఒడిగట్టిన అన్నగారిమీద మాకు భక్తి మరింత పెరిగింది.

❀ ❀ ❀ ❀ ❀

భాషాదేవికి సేవచేస్తుంటే అన్నగారి దర్జాకు ఏవిధమైన లోటూ కనిపించలేదు.

అన్నగారు దేవికి స్వయంగా విసిరారు. వారు దేవికి విసురుతుంటే దేవదాసీలు దేవుడికి వింజామరలు పట్టినట్టుండేది కాదు! గాలి అన్నగారికి జాస్తిగా తగులుతున్నదీ దేవికి జాస్తిగా తగులుతున్నదీ ఊహించరాకుండా ఉండేది!

దేవిని చుట్టుముట్టిన పరిమళాల గమాయింపు సర్వకాల సర్వావస్థలయందూ అన్నగార్ని సయితం ఆవరించి ఉండేది!

అన్నగారు దేవిని ఉద్యానాలలో విహరింపజేస్తుంటే వారి శోభ అద్వితీయంగా ఉండేది!

ఈ వైభవమంతా కళ్లారా చూసిన మాలో కొందరికి అన్నగారి వెంట ఒక దేవి ఉన్నదనే జ్ఞానం కూడా లేకుండా పోయింది.

ఏమంటే దేవిని గురించిన అన్ని విషయాల్లోనూ అన్నగారిదే ఆఖరు నిర్ణయం. దేవిని గురించి మే మేమాలోచించినా అన్నగారి పరంగానే ఆలోచించవలసి వచ్చేది...

❀ ❀ ❀ ❀ ❀

అయితే దేవికి సేవ చెయ్యటంలో అన్నగారిని మించిపోయినవాళ్లు మా దృష్టిలో చాలామంది బయల్దేరారు. అయినప్పటికీ వాళ్లంతా అన్నగారి దగ్గర ఉపదేశం పొందిన వాళ్లయినారుగాని అన్నగారి స్థానం ఆక్రమించలేక పోయినారు.

వాళ్లకదో ఇబ్బందిగా కనిపించినట్టులేదు. దేవిని మెప్పించటంకంటె మమ్మల్ని నలుగుర్నీ మెప్పించటం వారికి ముఖ్యంగా కనిపించింది!...

అన్నగార్ల సంఖ్య అధికం గాసాగింది.

❀ ❀ ❀ ❀ ❀

రానురాను అన్నగార్లందరికీ పెద్ద చిక్కొకటి వచ్చిపడింది.

అన్నగార్ల ఆధిక్యతను గురించీ, భాషాదేవికి వారుచేసే సేవను గురించీ కుర్రకారు వాళ్లు సందేహాలు వెలిబుచ్చసాగారు.

"భాషాదేవికి ఈ తుక్కు భాషకవిత్వం - ప్రేమకవిత్వం - అశ్రుకవిత్వం ఎందుకు వినిపిస్తారు. ఆవిడగారిచేత మామూలు విషయాలు మామూలు మనిషి మాదిరిగా మాట్లాడనివ్వండి.

"ఈ చందనార్చనలూ, పరిమళాలూ, వీణాతంత్రులూ దేనికీ? ఆవిడగారికి దారిద్ర్యమూ, జీవితంలో కుళ్లూ, ఆర్థిక సమస్యలూ, బాధా, నిస్పృహా - జీవితం తాలూకు యథార్థం యావత్తూ చూపించండి!

"ఆవిడగారికి మనం సేవచేసేదేమిటి? ఆవిడ మనకేమన్నా సేవ చేస్తుందేమో చూడండి."

"అందరితోపాటు ఆవిడనూ చాకిరిచెయ్యనివ్వండి! ఆవిడక్కూడా మామూలు చీరె ఒకటి కట్టబెట్టి అలుగ్గుడ్డా, చీపురుకట్టా, చేదా - తాడు చేతికివ్వండి!" అన్నారు కుర్రకుంకలు.

అన్నగార్ల ప్రాణం అల్లాడిపోయింది.

"మీ యథార్థం మాసిపోను! మీ యథార్థాలెందుకర్రా? చిరస్థాయి అయిన సత్యం కావాలి కానీ! ఈ జీవిత సమస్యలు ఇవాళ ఉంటై! రేపు పోతై! వాటితో భాషాదేవిని బాధిస్తారా?" అన్నారు అన్నగార్లు.

మా సమస్యలతో బాధపడలేని భాషాదేవితో మాకేం పని? మేం చిరస్థాణువులం కాము. చిరస్థాయి అయిన సత్యాన్ని ఏం చెయ్యాలో మాకు తెలీదు.

"మీ సత్యప్రియత్వం ఆఘోరించినట్టే ఉంది. మీరు గానం చేసే వీణా తంత్రులూ, నందనవనాలూ ఎక్కడున్నై? భాషాదేవిని గుడ్డిముండనూ, పిచ్చిముండనూ చేసి కూచోబెట్టి దిక్కుమాలిన జోలపాటలు పాడుతున్నారు! ఈలోపుగా ఇల్లంతా పేడకుప్పలూ, మట్టిరాసులూ, పందికొక్కు కన్నాలూ అయి ఊరుకుంది. ఇదంతా మీ భాషాదేవి అబ్బ ఎవడు బాగుచేస్తాడనుకున్నారు?

"మేం చెప్పినట్టు వింటే భాషాదేవికింత ప్రపంచజ్ఞానమన్నా కలుగుతుంది!" అన్నారు అల్లరివెధవలు.

అన్నగార్లు "హరి, హరీ!" అని చెవులు మూసుకున్నారు.

❀ ❀ ❀ ❀ ❀

కుర్రకుంకలు భాషాదేవిని రెక్కపట్టుకుని వీధిలోకి తీసుకొచ్చి, నాలుగు మూలలూ చూపించి, అలుగ్గుడ్డా, చీపురుకట్టా, చేదా - తాడూ చేతికిచ్చారు.

❀ ❀ ❀ ❀ ❀

కాని అన్నగార్ల అల్లరి జాస్తిగా ఉంది.

వెనకటి పూజార్ల మాదిరిగానే వీరుకూడా, "అత్యాచారం! మీకేం పొయ్యేకాలమ(్రా!" అంటున్నారు.

తమ హయాంలో తాము దేవిని ఎట్లా ఆరాధించిందీ చెప్పుకోలేక వాళ్ల అంకిళ్లు పడిపోతున్నై.

వాళ్ల దప్పుల మోత దుర్భరంగా ఉంది.

తమ తరవాత సాహితీదేవికి పూజార్లే లేరని ప్రచారం చేస్తున్నారు...

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వక పోవడమంటే ఇదేమరి!"

***ముద్రణ : చిత్రగుప్త, 15 నవంబర్ 1942***